జారుడు మెట్లు

వా. స. మూర్తి

నాకప్పుడు పన్నెండేళ్లు; సీతికి తొమ్మిది. ఆ రోజుల్లో వానలు వచ్చాయంటే మాకు ఎంతో సంబరంగా ఉండేది. వానల ఉపయోగాలని గురించి బడిలో వ్యాసాలు రాశాము కాని, పంతుళ్లు రాయనీయని ఉపయోగాలు కొన్ని మా కతి ముఖ్యంగా కనిపించేవి. అవి ఏమంటే: ఒకటి, బడికి పోనక్కరలేదు; రెండు, పుస్తకాలొకమూల పడవేసి సీతా, నేనూ ఇంకొక మూలచేరి కథలూ, కబుర్లూ, చెప్పుకోవచ్చు; మూడు, వాన మధ్య మధ్య తెరపి యిచ్చినప్పుడల్లా కాగితపు పడవలు చేసి నీళ్లలో వదులుతూ వాటి వెనకాల బట్టలు పైకి పట్టుకొని పరుగెత్తుతూ ఒళ్లంతా నీళ్లు చల్లుకుంటూ గంతులు వేయవచ్చు.

మా కోరికతీరా వానలు వచ్చాయి. రాత్రినుంచీ ఒకటే కుంభపోతగా వానకురుస్తోంది. ఆ ప్రొద్దున్న మేము రోజూ కన్న ఉత్సాహంతో లేచి, త్వరగా మొగాలు కడుగుకొని, చద్దన్నాలు తిని, వీధిచావిట్లో ఒకమూల చేరాము. చలిగా ఉందని సీతి దుప్పటి తెచ్చింది. ఇద్దరం ఆ దుప్పటే కప్పుకొని దగ్గరగా కూర్చున్నాము. ఇంతలో కిష్టిగాడు వచ్చి "నేనూ మీతో కూచుంటా" నన్నాడు - వెంకి వెధవ! వాడంటే నాకు చెడ్డ అసహ్యం. కాని వాడి నేమైనా అంటే అత్తయ్య మామీద విరుచుకుపడుతుంది. అందువల్ల, వాడిని నా పక్కన కూర్చోమని దుప్పటి కొంచెం ఎడం చేశాను. కాని వాడువచ్చి మా యిద్దరి మధ్యా కూర్చుంటానని పేచీపెట్టాడు. వాడెప్పుడూ అంతే - పానకంలో పుడక! అలాగే కూర్చోనిచ్చాం. మరి ఏంచేస్తాం? పోనీ కూర్చున్నవాడు ఊరికే ఉండవచ్చా, ఉఁహుఁ, అలా ఊరుకోడు. మేమేం చెప్పుకుంటే అది ఇక్కడనుంచే పెద్దగొంతుకతో అత్తయ్యకు చెప్పివేస్తాడు. కాబట్టి, మేమేమీ కబుర్లు చెప్పుకోడానికి వీలులేకుండాపోయింది. మరి చేసేది లేక వానకేసి చూస్తూ కూర్చున్నాము.

వాన జడికట్టి కురుస్తోంది. మా కాంపౌండు గోడా, గేటూ, ఎదర ఇళ్లూ, చెట్లూ, ఆ చెట్లమీద కాకులూ అన్నీ సన్నని గుడ్డ తెరలోనుంచి కనిపించినట్లుగా మసక మసకగా కనిపిస్తున్నాయి. మా అత్తయ్య చూరుక్రిందపెట్టిన రెండు బిందెలూ నిండి నీళ్లు పొర్లిపోతున్నాయి. మూడో బిందె ఇంకా నిండలేదు. ఠణ, ఠణ చప్పుడు చేసుకుంటూ ధారపడుతోంది. పెరడంతా నీటితో నిండిపోయి చిన్న చెరువులా తయారైంది. వాన ఎప్పుడు తెరపి యిస్తుందా, ఎప్పుడు కాగితపు పడవలు వదులుదామా, ఎప్పుడు నీళ్లలో గంతులు వేద్దామా అని ఎదురుచూస్తున్నాం. గేటు కొట్టిన చప్పుడైంది. "మామయ్య వచ్చాడు" అంటూ నేనూ, "నాన్న, నాన్న" అంటూ సీతీ, కిష్టిగాడూ ఒక్కసారే అరిచాము. నన్ను గొడుగు వేసుకొని వెళ్లి గేటు తీయమని అత్తయ్య వంటింట్లోనుంచే కేక వేసింది. నీళ్లలో దిగేందుకు మంచి అవకాశం దొరికిందికదా అని నేను ఒక్క ఉరుకులో గొడుగు తీసుకుపోతూంటే, సీతి తనుకూడా వస్తానంది. కిష్టిగాడు అంతకు ముందే తయారు! వాళ్ళిద్దరినీ ముందు పెట్టుకొని కాళ్ళతో నీళ్లు తోసుకుంటూ వెళ్ళి గేటు తీశాను.

మామయ్య కాదు!—ఎవరో కొత్త మనిషి. ఎత్తుగా, నల్లగా లావుగా వున్నాడు. పంచ పైకి కట్టుకొని ఒక చేతిలో సంచీ, రెండో చేతిలో తెల్లగుడ్డ వేసిన గొడుగూ పట్టుకొనిఉన్నాడు. ఆయనను చూస్తే మాకు భయం వేసింది. 'ఎవరూ ఎవరికోసం వచ్చారు' అనేవి అడగడం మరచిపోయాము. ఆయనకూడా మమ్మల్ని ఏమీ అడగకుండా లోపలికి వస్తున్నాడు. మేము గేటు వేయకుండానే వెనకకు తిరిగాము. "ఇక్కడా ఒక సముద్రంలా ఉందే!-ఏం వానలు, ఏం వానలు" అంటూ మెల్లగా రహదారి పడవలా ఆయన మా వెనకాలే వచ్చాడు. మామయ్యేమోనని అత్తయ్యా, సుబ్బులు వదినా గుమ్మంలోకి వచ్చి, ఎవరో కొత్తమనిషి రావడం చూసి 'ఎవరీయనా' అని ఆశ్చర్యపోతూ అలాగే నిల్చొనిపోయారు.

మేము పైకి వచ్చాము. మా వెనకాల వస్తూ ఆయన క్రిందిమెట్టుమీద అడుగువేసి జర్రున జారాడు. అక్కడ జారుడుగా వుందన్న సంగతి ఆయనకు చెప్పడం మరచిపోయాం మేము. జారడం జారడం ఆయన నీళ్లతో నిండిన బిందెలు దొర్లించివేసి గచ్చుమీదనుంచి తిన్నగా నీళ్లలోకి పోయాడు. బిందెలు కూడా ఆయన వెనకాలే దొర్లుకుంటూపోయాయి. మేంముగ్గురం ఫకాలున నవ్వేశాం. మా అత్తయ్యా, వదినలకి కూడా నవ్వాగలేదు. వదిన పక్కకు తప్పుకుంది. ఆయన 'అయ్యో, అయ్యో' అంటున్నాడు. కాని మేము నవ్వాపుకోలేకపోతున్నాము. ఏం చేయాలో తోచడంలేదు. అంతలో అత్తయ్య నవ్వాపుకొని, కొత్తమనిషి అన్న సంకోచం ఎలాగో వదులుకొని, "రండర్రా. ఆయన్ని పైకి లాగుదాం, పాపం" అంటూ ఎదరకు వచ్చింది. వదినా, మేమూ అంతా కలిసి ఆయన్ని పైకి లాగడానికి ప్రయత్నించాము. కాని సామాన్యంగా కదులుతుందా ఆ పర్వతాకారం! పైగా నీళ్లలో ఉన్నాడాయె! ఉన్న శక్తి నంతా ఉపయోగించి ఎలాగో ఆయనను గచ్చుమీదకు యీడ్చాం. తల పట్టుకొని నడుంవరకూ ఎత్తాం. ఆయన కూడా ప్రయత్నంచేసి లేచాడు-ప్రభను లేపినంత ఆనందం కలిగింది మాకప్పుడు. మేమంతా ఇవతలికి వచ్చాము. ఆయన బట్టలన్నీ పూర్తిగా తడిసిపోయాయి. సంచీ మాయింటి పై గుమ్మలమీదే పడిపోయింది కాబట్టి అందులోవి మాత్రం తడవలేదు. ఆయన కాళ్ళు కడుగుకొని, తడిబట్టలు విప్పేసి, పొడివి కట్టుకున్నాడు. తడిబట్టలు పిడిచి, మాకడ్డంగా వీధి కనపడకుండా ఆరగట్టి, కుర్చీలో కూర్చున్నాడు. మేము మా స్థానం మార్చుకోవలసివచ్చింది. వీధి కనబడేటట్లు ఇవతలవైపుకు వచ్చి కూర్చున్నాము.

ఆయన నన్నడిగాడు: "రామయ్యగారు లేరా?"

"లేరండీ, ఊరు వెళ్లారండీ" అన్నాను.

"ఊరా! ఎందుకూ?"

"మా సుబ్బులు వదినకు ఏదో సంబంధం ఉందట, చూడడానికి వెళ్లాడండీ."

నేను ఈమాట అన్నానో లేదో ఆయన ఎగిరి గంతువేశాడు. నిజంగా ఎగరలేదులెండి, కాని అంత పనీ చేశాడు. కుర్చీ గట్టిగానే మూలిగింది. కళ్లు పెద్దవిచేసి నాకేసి వింతగా చూశాడు. ఎందు కలా చూస్తున్నాడో నాకర్థం కాలేదు. ఆయన

మళ్ళీ ఇంటి కప్పువైపు చూస్తున్నాడు. ఇంతలో మా సుబ్బులు వదిన కాఫీ పట్టుకు వచ్చింది. ఆయన మా వదినకేసి తేరిపార చూడసాగాడు. వదినకు భయంవేసి గ్లాసు అక్కడపెట్టి లోపలకు పరుగెత్తింది. అంత పెద్దమనిషీ మా వదినకేసి అలా చూడడం నాకు చెడ్డ ఆశ్చర్యం వేసింది. ఆయన నా వైపుకు తిరిగి "రామయ్యగారు మీ నాన్నగారేనా?" అని అడిగాడు.

"కాదండీ మామయ్య అవుతాడ"న్నాను.

"ఆ పిల్లలూ?" అని ప్రశ్నించాడు.

వాళ్లు మా మామయ్య రెండో కూతురూ, కొడుకూ అనీ, సుబ్బులు వదినే పెద్దకూతురనీ చెప్పాను. ఆయన ఆలోచిస్తూ కూర్చున్నాడు.

గేటులో ఏదో గుర్రపుబండి వచ్చి ఆగింది. ఈవేళ చుట్టాలమీద చుట్టాలు వచ్చి పడుతున్నారు, ఏదో విశేష ముండాలి అనిపించింది నాకు. బండివాడు ముందుకు వంగి, "అబ్బాయిగారూ, ఇలా రాండి" అని కేకవేశాడు. నేను గొడుగు తీసుకొని వీధిలోకి పరుగెత్తాను. "కొవ్వూరి రామయ్యగారి యిల్లు యిదేనా, అబ్బాయిగారూ," అని అడిగాడు బండివాడు. "ఏ కొవ్వూరి రామయ్యగారు?" అని నే నడిగాను—మామయ్య తన పేరూ, ఇంటిపేరూ గలవారింకా నలుగు రాఊళ్ళోనే ఉన్నారని చెప్పాడు కాబట్టి. బండిలో నుంచి పెద్ద రంకె వినబడింది: "కొవ్వూరి రామయ్యగారి యిల్లు ఇది అవునా కాదా?" అని. ఆ కంఠంవరస చూస్తే ఆయన ఎవడో బండి దిగివచ్చి కొడతాడేమో ననిపించింది "ఇదేనండి" అని అక్కడ ఆగక లోపలికి పరిగెత్తుకు వచ్చాను.

ఒక ఏభైఏళ్ళ ఆయనా, ఒక ఇరవైఏళ్ల కుర్రవాడూ, వెనకాల చిన్న పెట్టె చేతిలో తీసుకొని బండివాడూ వచ్చారు. 'మెట్ట జారుతుంది' అంటూనే ఉన్నాం: ఆ పెద్దాయన అక్కడే అడుగువేసి జారాడు. చటుక్కున ఇరవైఏళ్ళ కుర్రవాడూ, బండివాడూ పట్టుకున్నారు కాని లేకపోతే అంతకు ముందువచ్చినఆయన గతే ఈయనకూ పట్టేది. ఆయన ఇవతలికివచ్చి బండివాడికి డబ్బు లిచ్చివేసి, "ఈ వానలలో ఏ పనీ పెట్టుకోకూడదండీ. కాని వస్తామని

"మీరు కనుక అలా చేశారు. మాలాటివాళ్ల దేముందండీ? ఒక్క పిల్లకే పెళ్లి చేయలేక తన్నుకులాడుతున్నాం" అన్నది అత్తయ్య.

★ జారుడు మెట్టు ★

చెప్పినతర్వాత రాకపోతే బాగుండదని వచ్చాం. సగందారిలో పట్టుకుంది ఈ దిక్కుమాలిన వర్షం" అన్నాడు. ఆమాట వినేసరికి గుమ్మంలో నిలుచున్న మా అత్తయ్య చేటంత మొగమూ రెండు చేటలంత అయింది. మా వదిన తలవంచుకొని లోపలికి ఒక్క పరుగు తీసింది. అంతకు ముందువచ్చిన ఆయన కొత్తవాళ్ళకేసి చురచుర చూస్తున్నాడు. వచ్చినవాళ్లుమాత్రం ఆయనకేసైనా చూడలేదు. అత్తయ్య, "అవిగో; ఆ నీళ్ళతో కాళ్లు కడుగుకోండి, బాబూ! వేన్నీళ్లు కాస్తాము. నీళ్లు పోసుకుందురుగాని" అని వాళ్ళతో చెప్పి మమ్మల్ని లోపలికి రమ్మంది. తలొకరికీ తలోపని అప్పజెప్పి, అటూ ఇటూ పరుగెడుతూ, అందరినీ నానా కంగారు పెట్టేస్తూ, మా వదినతో "ఒసేయి, త్వరగా నీళ్లుపోసుకొని కొత్తబట్టలు వేసుకోవే. నువ్వేం పనిచేయనక్కర్లేదులే" అంటూ ఎన్నడూ లేని ప్రేమంతా ఒక్కమారు వెళ్లబోసింది.

ఈ హడావుడిఅంతా ఏమిటో మాకింకా బోధపడలేదు. వెళ్లి వదిన నడిగాను—సంగతేమిటని. వదిన ముసిముసి నవ్వు నవ్వుతూ నా బుర్రమీద ఒక్క మొట్టికాయ పెట్టింది. మొట్టికాయ అవసరమేమిటో బోధపడక బుర్ర రాసుకుంటూ వుండగా కిష్టిగాడు నాదగ్గిరకి వచ్చి "అక్కయ్యకు పెళ్లివారురా, బావా" అంటూ చెవిలో ఊదాడు అంతత్వరగా ఎలా గ్రహించివేశాడో కాని—అందుకే అప్పుడప్పుడనుకునేవాడిని కుళ్ళుమోతు కిష్టిగాడికి తెలివితేటలుకూడా పెట్టి భగవంతుడు చాలా అన్యాయం చేశాడని. ఇంతలో "ఒరే సత్యం, త్వరగా నీళ్ళు కాచమంటే అటూ యిటూ తిరుగుతావేమిరా," అంటూ అత్తయ్య తరుముకు వచ్చింది. ఆ దిక్కుమాలిన కట్టెలు కళ్లు పోయేటట్లు పొగ చిమ్మతాయి కాని ఎంతసేపటికీ మండవు. ఎలాగో తంటాలుపడి నీళ్లుకాచే 'డ్యూటీ' పూర్తిచేసుకున్నాను. 'పెళ్లికొడుకూ,' (ఇంకా కాకపోయినా, అయినట్లే మేం భావించాం.) ఆయన తండ్రీ నీళ్లుపోసుకొని, బట్టలు వేసుకొని హాలులో కూర్చొని ఏమో చెప్పుకుంటున్నారు. 'పెళ్ళికొడుకు'ని తనివితీరా చూడాలన్న కుతూహల మొకవైపు లాగుతూంటే, వంటింట్లో పిండివంటల గుమగుమ లింకొకవైపుకు లాగుతూ వుంటే మేము సందిగ్ధావస్థలో పడ్డాం. ఆఖరికి కమ్మకమ్మని వాసనలు బాగా ఎక్కువయ్యేసరికి ఆగలేక పొయ్యిదగ్గర అత్తయ్య చుట్టూ చేరి గుటకలువేస్తూ కూర్చున్నాం సీత, నేనూ—కిష్టిగాడి సంగతి సరేసరి! పెళ్ళివారి ధర్మమా అని అత్తయ్య గారెలు, బజ్జీలూ తయారు చేస్తోంది. చేస్తూ తెగ విసుగుకుంటోంది: "సమయానికే రావాలీ ఆ ఘటంకూడా. చేసిందంతా తనే చెల్లించేటట్లున్నాడు. ఆ విఘ్నేశుడి పొట్ట కిదే దరి!" మేముకూడా కంగారుపడ్డాం—చివరికి మాకేమీ మిగలవేమోనని మా భయం మాది! ఉన్నట్లుండి కిష్టిగాడి కేం తోచిందో కాని, పరుగెత్తి వెళ్లి ఆ నల్లటి పెద్దమనిషి దగ్గరకుపోయి, "మానాన్న రాలేదు; మీరింకా ఇక్కడే వుంటారా?" అని అడిగాడు. అత్తయ్య తనకొడుకు అతి తెలివితేటలకి నాలుక కరచుకుంది. నేను పోయి కిష్టిగాడిని మెడపట్టుకుని యివతలకి లాక్కొచ్చాను.

వంటలయ్యాయి. 'పెళ్ళివారి'ని లేవమన్నాం. లావుపాటి ఆయననుకూడా లేవమన్నాం. ఆయన రెండుమూడుసార్లు అరుగు చివరకు వెళ్ళి చేయి చాపి వాన చూశాడు. ఇవతలికి వచ్చి మావంక తెల్లబోతూ చూశాడు. చూసిచూసి చివరికి మడికట్టుకు వచ్చాడు. మేము భయపడ్డట్లుగా ఏమీ జరగలేదు. మా అత్తయ్య జాగ్రత్తగా చూసి వడ్డించిందికూడా. ఆ నల్లటి ఆయన పూర్తిగా తినలేదు. పాపం, చాలా మంచివాడే ననుకున్నాం. నిజానికి చెప్పవలసివస్తే 'పెళ్లికొడుకు' తండ్రే తృప్తిగా భోంచేశాడు. భోజనమయిన వెంటనే అన్నాడు: "రామయ్యగారు బహుశా ఈ వర్షంలో రాలేరు. కాబట్టి ఆ చూపుల తతంగ మేదో త్వరగా కానిచ్చివేయండి. వర్షంలో తడిశాను. ఏ జ్వరమేనా వస్తుందేమో - అనుమానంగా ఉంది." - అలాంటి వాడు అంతగా మెక్కడ మెందుకో? తరువాత మూలిగి మమ్మల్ని చంపేందుకు! అత్తయ్య అలాగేనంది.

హాలులో కూర్చున్నారు వాళ్లు. మేముకూడా వాళ్లపక్కనే చేరాము. కొద్దిసేపటికి సుబ్బులు వదిన అలంకరించుకు వచ్చింది. సిగ్గుపడుతూ తలవంచుకొని ఒకపక్కగా నిలుచుంది. అప్పటి సుబ్బులు వదినను చూసి మేమే ఆశ్చర్యపోయాము. నామట్టుకు నాకు మా వదినంత అందకత్తె ప్రపంచంలో మరొకతె ఉండదనిపించింది. కాదని ఎవడేనా అంటే వాడితో కుస్తీ పట్టేసేవాణ్ణి. సీతకూడా పెద్దదైన తర్వాత అలాగే అవుతుంది కదా అనుకొంటూ, దానివంక చూశాను. సీతలో అప్పుడే ఆ ఛాయలు కనిపించాయి. 'పెళ్లికొడుకు' వదినకేసి కళ్లప్పగించి చూస్తున్నాడు. అతని తండ్రి "ఏదీ, ఒక పాట పాడమ్మా" అన్నాడు. పాట విషయానికి వస్తే మా సుబ్బులు వదినచేత పాడించక పోవడమే మంచిదని మా అభిప్రాయం. మా అభిప్రాయం ఎలా ఉన్నా, ఆయన చెప్పడం మూలాన, అత్తయ్య వెనకనుంచి పొడవడం మూలాన వదిన పాటకు వుపక్రమించింది. 'పెళ్లికొడుకు' అమృతం తాగినంత ఆనందంగా వదినపాట వింటున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కాని వదిన మధ్యలోనే పాట ఆపేసింది. మంచిపనే చేసిందనుకున్నాము మేము. తండ్రి అన్నాడు. "పోనీలే అమ్మా, అంత సిగ్గుగా ఉంటే వద్దులే...ఏదైనా ఒక మంచం వాల్చు అమ్మా; చలివేస్తోంది."

కంగారుగా పక్క వసారాగదిలో మంచం వేసి పక్కవేశాం. ఆయన 'ఉహుహు,' 'అహాహ,' 'హరిహరీ,' 'శ్రీహరీ' అంటూ వణకిపోతున్నాడు. దుప్పటీ కప్పి ఆయన పక్కనే కూర్చున్నాడు కొడుకు. కొంతసేపటికి చలి తగ్గి జ్వరం వచ్చినట్లుంది. ఆయన కళ్ళుమూసుకొని మూలుగుతున్నాడు. తండ్రి గాభరా కొంత తగ్గినతర్వాత 'పెళ్లికొడుకు' ఇవతలికి వచ్చాడు. నన్ను పిలిచాడు. దగ్గరకు వెళ్లి ఇట్టే స్నేహం కలిపివేసుకున్నాను. కిష్టిగాడు కూడా ప్రయత్నం చేశాడుగాని వాడిది ఒకరితో స్నేహం చేయగల స్వభావం కాదు. అందువల్ల నన్ను చూసి కుళ్లిపోతూ ఉంటాడని నాకు తెలుసు. నేను 'పెళ్ళికొడుకు'కు (-ఇక గోపాలరావు అంటాను, స్నేహమయింది కాబట్టి-) నా పుస్తకాలూ వగైరాలన్నీ చూపించాను. వదిన అల్లిన అల్లికలూ, మాకు వేసిపెట్టిన బొమ్మలూ కూడా చూపించాను. అతని చేతకూడా కొన్ని బొమ్మలు వేయించుకున్నాను. బోలెడన్ని కత్తిపడవలూ, జంటపడవలూ, స్టీమరూ కూడా తయారుచేయించుకున్నాను. నాతో మాట్లాడుతూండగా అతని చూపులు చాలాసార్లు మా యింటి లోపలి గదివైపు పోతూ ఉండడం గమనించాను. పోయి సీతతో కథలో మేము నడిపించవలసిన భాగం విషయం చర్చించపోగాను.

ఇంతలో దొడ్లోనుంచి "చచ్చానర్రో" అంటూ ఒక పొలికేక వినిపించింది. దొడ్లోకి పరుగెత్తాం. నూతి గచ్చుపళ్లెం మీద అత్తయ్య గిరగిర తిరుగుతోంది. మేము పైకి లేవనెత్తడానికి ప్రయత్నిం

...చాము. కాని లేస్తేనా? మా అత్తయ్య కాయం కూడా చెప్పకోదగ్గదే. లేవడం మాట అటుంచి మమ్మల్ని కూడా క్రింద పడవేసేటట్లుంది. ఇంతలోకి గోపాలరావు అక్కడకు వచ్చి "అయ్యో, పాపం" అంటూ ముందుకు వచ్చాడు. అతనిని చూసి సిగ్గుతో మా వదిన అత్తయ్య సమాంతంగా వదిలేసింది. అత్తయ్య అరవసాగింది "అదేమిటే అలా వదిలేస్తావు? త్వరగా పైకి ఎత్తండే. వానలో తడిసిపోతున్నాం" అంటూ. గోపాలరావు ఒక చేయి పట్టుకున్నాడు. వదిన రెండో చేయి పట్టుకోవలసి వచ్చింది. కాని ఒకరి మొగాలొకరు చూసుకుంటూ అత్తను ఎత్తడం మానేశారు. వాళ్ల మొగాలు చూస్తూ మేమూ ఎత్తడం మానేశాం. అత్తయ్య అరుపులు ఎక్కువయేసరికి ఆఖరికి ఎలాగైతేనేం లేవనెత్తి లోపలికి తీసుకువచ్చాం. "దిక్కుమాలిన వర్షం! ఒకటే జారుడు! కాలు బెణికిపోయింది గట్టి సమయంలో పనిచేసుకోకుండా" అనుకుంటూ వంటింట్లో చాపమీదకు చేరింది.

వదినే అన్ని పనులూ చేయవలసివచ్చింది. ఇదే మాకు మంచిసమయమని సీతా నేనూ కలిసి వదిన ఉన్న సమయంలో గోపాలరావునీ, గోపాలరావు ఉన్న సమయంలో వదిననీ ఒకే గదిలోకి వచ్చేటట్లు చేసి, వెనకకు తిరిగి తప్పుకోకుండా అడ్డుపడి వాళ్ల దొంగచూపులూ, నవ్వులూ చూసి నవ్వుకుంటున్నాం. కిష్టిగాడు వెళ్ళి మేమిలా చేస్తున్నామని తల్లికి రిపోర్టు చేశాడు. అత్తయ్య వాడి బుగ్గ పట్టుకొని గట్టిగా నలిపేసింది - అదీ! అదీ! బాగా అయింది వెధవకి అంటూ గంతులువేశాను నేను. ఎన్నడూ చీమంత మాట అనని అమ్మ ఈనాడు ఇలా మారిపోయిందేమా అని తెల్లబోతూ ఏడవకుండానే ఊరుకున్నాడు వాడు. సీతీ, నేనూ కలిసి వదినా, గోపాలరావుల చూపు లెన్నిసార్లు కలుసుకున్నాయో జాగ్రత్తగా లెక్కపెట్టుకుంటున్నాం. మా లెక్కలలో ఏమైనా తేడా వస్తే సీతిదే 'రైటు'ని పేచీ లేకుండా చూసుకొన్నాను.

రాత్రి భోజనాలు కూడా అయ్యాయి. పడకల ఏర్పాటు కూడా అయింది. నేనూ, గోపాలరావు అన్నయ్య (ఇప్పుడు మా స్నేహం చుట్టరికంవరకూ వెళ్ళిపోయింది లెండి) ఒకే మంచంమీద పడుకున్నాం. అవకాశం దొరికింది కాబట్టి ఇక మా వదినను గురించి వర్ణించడం మొదలుపెట్టాను. కావాలంటే, మా వదినఅంత మంచిదీ, చక్కనిదీ, నేర్పుగలదీ ఇంకొకరుండరని బల్లగుద్ది చెప్తానన్నాను. అతను కాదంటేగా! వదినను గురించి ఎంత విన్నా అతనికి తనివితీరేటట్టు లేదు. ఇంక ఏ కొద్ది సందేహం కూడా లేకుండా చేసుకోవేందుకు, 'మనం మనం ఇక ఒకటే కాబట్టి, మనలో మనకి భేదాలేమిటి, మా వదిన అంటే నీకు పూర్తిగా ఇష్టమేనా' అని అతనిని నిలవదీసి అడిగివేశాను. "మా వదిన చాలా బాగుంటుంది" అన్నాడతను

నేడే
మృదువైన మనోహర చర్మపు
రహస్యమును కనుక్కోండి
... పాండ్స్ కోల్డ్ క్రీమ్‌తో మీ చర్మమును పరిశుభ్రం చేసికొనుడు . . . ప్రపంచమంతటా అందమైన స్త్రీలు సౌందర్య రక్షణకు దీనినే విశేషంగా వాడుచున్నారు. తేలికగానున్న యీ క్రీమ్‌లోనున్న విశేషనూనెలు చర్మములోనికి చొచ్చుకొనిపోయి దుమ్మును, మురికిని యింద్రజాలమువలె తొలగించి మీ చర్మమును మెత్తగా, నవనవగా అగపడునట్లు చేయును.
పాండ్స్ కోల్డ్ క్రీమ్ ఒక సీసాను నేడే కొనుడు.

పాండ్స్
కోల్డ్ క్రీమ్
రోజంతయు రక్షణకుగాను ప్రతి ఉదయమున పాండ్స్ వ్యానిషింగ్ క్రీమును వాడుడు. రాయగానే అదృశ్యమైపోవు యీ సౌందర్య సహకారిని వాడితే మీ చర్మమెంత మనోహరంగా అగపడునో మీరే గమనించగలరు:
దీనిమీద పౌడరును రాస్తే మీరు ఎంతో అందంగా అగపడుతారు. అసలు పాండ్స్ క్రీములనే గమనించి కొనుడు.
P. 8745

★ జారుడు మెట్టు ★

మెల్లగా, కొత్త పెళ్ళికూతురులా సిగ్గ పడుతూ. అమ్మయ్య! నా గుండెలమీద నుంచి పెద్దభారం తొలగిపోయినట్లే! మా వదినకి నేనే సంబంధం ఖాయపరచానని పించింది. తరువాతకబుర్లలో నన్ను తనతో మద్రాసు కూడా తీసుకు వెళుతానని నా చేతిలో చేయి వేశాడు 'అన్నయ్య'. కబుర్లలో పడి ఎప్పుడు నిద్రపోయానో కాని తెల్లగా తెల్లవారేవరకు మెలకువే రాలేదు.

మర్నాడు ప్రొద్దున తడిసి ముద్దై వచ్చాడు మామయ్య. వస్తూనే నల్లటి ఆయనను చూసి, "ఏమండోయి రామలింగం గారూ, ముత్తానికి మీరే ముందు చేరారే!" అన్నాడు.

అంతవరకు చచ్చు పెద్దమ్మలా కూర్చున్న రామలింగంగారు ఒక్కసారిగా ఠీవిగా కాలుమీద కాలు వేసుకొని "వస్తానన్న రోజుకు రాకపోతే ఎలాగండీ" అన్నాడు.

"అవును, మీరన్న రోజుకే వస్తారని తెలుసును. నేను లేనందుకు మీ రేమనుకుంటారో అని చాలా కంగారుపడాను సుమండీ. మీకన్నా ముందుగానే చేరవలసింది. కాని మధ్యలో ఒక చుట్టం కనిపించి తన పనికోసం వాడి ఊరుకి లాక్కుపోయాడు. పని అయిన తర్వాత బయలు దేర బోతూంటే వాన ఒకటి పట్టుకుంది. వర్షం వస్తే ఆ వూరికి బయట ప్రపంచంతో ఇక సంబంధం లేనట్లే. ఎలాగో చచ్చి చెడి, ఈవేళకు రాగలిగాను——ఇంతకీ మీరు మా యిల్లు ఇబ్బందిలేకుండా తెలుసుకో గలిగారా?"

"ఆహా, మీరు వివరంగా చెప్పినతర్వాత ఇబ్బంది ఏముంది?"

"ఇక్కడ సరిగానే ఉంటోంది కదూ, లోటు జరగలేదు కదా" అని అడిగి ఆయన జవాబు చెప్పకముందే, "ఇప్పుడే వస్తున, మర్యాదా, ఎందుకూ కాని వాళ్లకు రాజ ఉండండి" అంటూ లోపలికి వచ్చాడు మామయ్య. రామలింగంగారు మూతి బిగించుకొని జవాబు చెప్పలేదు. గోపాల రావు 'అన్నయ్య' మామయ్యనుచూసి గదిలోకి పరుగెత్తుకువెళ్ళి, తండ్రిని కంగారుగా లేపుతున్నాడు. మామయ్య అటు చూడనేలేదు. తిన్నగా వంటింట్లోకి వచ్చాడు. వెనకాలే మేమూ ఉన్నాము.

మామయ్య మొట్టమొదట అత్తయ్య నడిగిన ప్రశ్న "ఆయన్ని బాగా చూశారా?" అని.

అత్తయ్య సరిగా వినిపించుకోకుండానే "అందరినీ చాలా బాగా చూశాం" అంది.

"అందర్నీ ఏమిటే, ఒకరే అయితే!" అన్నాడు మామయ్య ఆశ్చర్యపోతూ.

"ఎవరిని గురించి మీరు మాట్లాడుతూంటా?" అంది అత్తయ్య మరీ ఆశ్చర్యపోతూ.

"ఎవరిని గురించి నువ్వు మాట్లాడుతూంటా," అన్నాడు మామయ్య.

"కొంపతీసి ఆ పిల్లవెధవను గురించి కాదుకదా మీ రనేది!"

"ఏమిటా మాటలు!" అన్నాడు మామయ్య మండిపోతూ.

అత్తయ్య అమాంతంగా వెనక్కి పడిపోయి అలానే మూర్ఛపోయింది. తొందరగా నీళ్లు చల్లి తేరుకోజేశాము.

తెలివిరాగానే మామయ్య అడిగాడు. "నీ ఆశ్చర్యాని కేంగాని, ఇందాకటినుంచీ నువ్వు చెపుతున్న దెవరిని గురించి? ఆయన కాక మరెవరు వచ్చారు?"

"అదేమిటి, ఆ కుర్రవాడూ, తండ్రీ వస్తే—తెలియదంటారేమిటి!"

"ఎవరూ? నేను మాడలేదే! ఈ వరస చూస్తే మీ రసలాయన కీసడింపుల మర్యాదలూ చేసినట్లున్నా" రంటూ మామయ్య కంగారుగా రామలింగంగారి దగ్గరకు పరుగెత్తాడు.

అప్పటికి గోపాలరావు తండ్రి లేచి కూర్చున్నారు. మామయ్యను ఆపి "అయితే మీరు రామయ్యగారు కారన్న మాట" అన్నారు.

"నేను రామయ్యనే నండి" అన్నాడు మామయ్య తెల్లబోతూ.

"అంటే అదే, కావూరి రామయ్య గారు."

"నేను కావూరి రామయ్యనే నండి!"

"మా కింకొక రెవరో తాము కావూరి రామయ్యగారమని చెప్పారే!"

"ఓహో, అదా అండి, కావూరి రామయ్య అనే పేరున్నవాళ్ళం మొత్తం నలుగురమున్నా మీ ఊళ్లో."

"ఈ దిక్కుమాలిన ఊళ్లో ఈ గందరగోళం కూడానా. ఇలా ఉంటుందని ఎన్నడూ అనుకోలేదు. సరిగా కనుక్కుందామన్నా వెధవ వర్షం ఒకటి తయారైంది!"

"తమరు చెప్పిన కావూరి రామయ్యగారెవరై ఉంటారు చెప్మా? - ఇంతకూ మీరు వచ్చిన పని?"

•"పెళ్ళిసంబంధం కోసమండీ. వారం రోజుల క్రితం కావూరి రామయ్యగారనే ఆయన ఒకరువచ్చి తమ దగ్గర ఒక పిల్ల ఉందనీ, చూసుకొని వెళ్లవలసిందనీ అడిగారు."

"కట్నం ఏమాత్రంలో ఉన్నారు?"

"మూడువేలు కట్నమూ, లాంఛనాలూ ఇస్తామన్నారండి. ఇంకా తేల్చుకోలేదు."

మామయ్య పెదవి విరుచుకున్నాడు. కొంతసే పాలోచించి, "వాన వెలిసిన తర్వాత తెలుసుకుందాం లెండి," అని చెప్పి రామలింగారి దగ్గరకువెళ్ళి "సమయానికి నేను లేకపోయాను. మావాళ్ళు మీకేమీ-" అంటూ నసిగాడు మామయ్య.

ఆయన మామయ్య అనుమానం ధృవపరుస్తూ "ఆఁ, ఆఁ, దానికేం లెండి." అని, మళ్లీ భీషణంగా "మీరేదో మరో సంబంధం విషయమై-" అంటూండంగానే

మామయ్య "ఇంకో సంబంధ మేమిటండీ? నే నెరగనే! ఆ వచ్చినవాళ్ళు మాకోసం కాదు, ఇంకొకరికోసం," అన్నాడు.

"వారో మరొకరో"

"రామ, రామ! అదేమీ లేదండీ. అంత నిజాయితీ లేనివాడినా నేను? - ఆఁ, ఆఁ అది. నేను మీకోసం వెళ్ళి ఇంతవరకూ రాకపోవడం, ఈలోగా మీరు రావడం, మీరు ఫలానా అని తెలియక పోవడంవల్ల

జమ్మివారి 'లివర్‌క్యూర్'
పిల్లల లివర్ & స్ప్లీన్ వ్యాధుల చికిత్సకు, నివారణకు
బ్రాంచి ఆఫీసు & వైద్యశాల
తాడంకివారి వీధి, బకింగ్‌హాంపేట పోస్టు
విజయవాడ.
పై అడ్రస్సునందు మాడాక్టరుగారిని కలుసుకొని సలహా పొందవచ్చును
జమ్మి వెంకటరమణయ్య & సన్సు, H.O. మదరాసు-4,
విజయనగరం బ్రాంచి-ఒరుగంటివారివీధి.

మా వాళ్ళు మీకలా చెప్పటం జరిగివుంటుంది. అంతే కాని మరేమీ కాదండి. మీకేమైనా లోటుపాట్లు జరిగితే క్షమించాలి. ఈవేళ నేను సర్దుకుంటాను. తెలియకపోవడంవల్లనే ఇలా జరిగిందండి. మీరు మరోవిధంగా మనసులో పెట్టుకోకండి" అంటూ లోపలికి వచ్చాడు మామయ్య.

"అయితే, ఆయన ఫలానా అని అంత మాత్రం తెలుసుకోలేరూ? ఇంటికి వచ్చిన పెద్దమనిషిని అలా అవమానం చేస్తారా?" అని అడిగాడు మామయ్య కోపంగా.

"నా కన్నయ్యలా గున్నాడు ఆయన నా కల్లుడా?" అంది అత్తయ్య వింతగా చూస్తూ.

మాకు రామలింగంగారు రావడం, జారి పడడం వగైరా సంగతులు జ్ఞాపకం వచ్చి, ఒక్కసారిగా పక్కున నవ్వేశాం. అది చూసి మామయ్య "ఛత్, భడవల్లారా, పొండవతలికి" అంటూ మమ్మల్ని అక్కణ్ణుంచి తరిమేశాడు. మేము తలుపులచాటున దాగి వినసాగాం.

"నీకెలా నచ్చుతుందీ ఈ సంబంధం! అలాంటి పిల్లవాడు కావాలాయె!" అన్నాడు మామయ్య.

"ఆ పిల్లవాడికేం? నిక్షేపంలా ఉన్నాడు. కళ్ళకద్దుకు చేసుకోవలసిన సంబంధం" అంది అత్తయ్య.

"అవునవును పాపం - తేరగా వస్తేనూ! కట్నమెంతో తెలుసా?"

"ఎంతేమిటి?"

"మూడువేలూ, లాంఛనాలూను. ఇంకా పైకి కూడా ఉండవచ్చు."

అత్తయ్య నోట్లో పచ్చి వెలగకాయ పడింది.

"ఆ పిల్లవాడు కావాలిగా? తే మూడు వేలీయడానికీ, మరి మూడు వేలు పెళ్ళి ఖర్చులకీ! చేసేస్తాను. నీకే కాదు నాకూ చేయాలనిఉంటుంది, అటువంటి సంబంధం. కాని డబ్బండీ, డబ్బు!" అన్నాడు మామయ్య వెటకారంగా.

అత్తయ్య అలా నోరు తెరచుకొనే ఉంది. ఇటు నా నెత్తిమీద చినుకులు పడుతూవుంటే 'ఇదేమిటి ఇంట్లో కూడా కురుస్తోందా ఏమిటి' అనుకొంటూ పైకి చూశాను. నా వెనకాలే నిలుచున్న వదిన కళ్లనుంచి రాలుతున్నాయి ఆ బొట్లు. నేను చూడనేలేదు; వదిన అక్కడ ఉందని. నెత్తి పూర్తిగా తడిసిపోతుందేమోనని భయపడి పక్కకి తిప్పుకున్నాను వదిన కన్నీళ్లు చూసేసరికి నాకూ కళ్లనీళ్ల పర్యంతమయింది.

మామయ్య వదినవైపుకు తిరిగి "అమ్మాయి, నీ కదృష్టముంటే ఏ ధనవంతుల ఇంట్లోనో పుట్టవలసింది, కర్మం కాలే ఇలాంటి దరిద్రుల కొంపలో జన్మించావనుకో అమ్మా. నేనేదో నీ కపకారం తలపెట్టాననిమాత్ర మనుకోకు తల్లీ" అన్నాడు.

అత్తయ్య అప్పటికి తేరుకుంది. "అందుకోసం ఇలాంటి సంబంధమా చేసుకోవడం" అని అడిగింది.

"ఏం, ఈ సంబంధానికేం? ఏభై ఎకరాల బంగారంలాంటి భూమి ఉంది. రెండు మేడలున్నాయి. వెనకటి పెళ్ళిళ్ళవల్ల కొడుకు లెవరూ లేరు. ఇంతకన్న మంచి సంబంధ మెక్కడినుంచి వస్తుంది?"

"ఆయన వయస్సెక్కడ, దీని వయస్సెక్కడ? అందులోనూ తుమ్మమొద్దు లాంటి మనిషి"—

"ఎంచడానికేం, ఎందుకూ మారని వీగా నమ్మయినా ఎంచుతుంది. సొంతభూమి, ఉండేందు కాఖరికి ఒక పూరికొంపైనా

జారుడు మెట్టు

లేక, స్కూలు ఫైనలు కాదు, ఫరెడ్ ఫారమ్ మూడుసార్లు తప్పిన చవటదద్దమ్మ కూడా వెయ్యికి దిగడంలేదు. ఈ రోజుల్లో అటువంటప్పుడు అందమైనవాడినీ, చదువుకున్నవాడినీ, ఆస్తిపరుణ్ణీ నీ కూతురికి ఎలా తెస్తావు! - పిల్ల సుఖపడుతుందని నిక్షేపంలాంటి సంబంధం తీసుకువస్తే వేయి వంకలా.?”

“ఏమయినా సరే ఈ సంబంధానికి నేనెంతమాత్రమూ ఒప్పుకోను”అంది అత్తయ్య ఖండించి వేసినట్లు.

మామయ్య ఛర్రుమన్నాడు. “ఒప్పుకోవు, ఒప్పుకోవు! నీకేం? పడేది నేను. నలుగురిచేత మాటలు పడలేక, కాళ్ళరిగేటట్లు తిరిగినా చేతికందే సంబంధాలు కనిపించకుండా చస్తూంటే అదృష్టవశాత్తు ఈయన సంబంధం తెలిసింది. అది కాదంటావు! గట్టిగా చెపుతున్నాను. చేస్తే ఈ సంబంధమే; మరొక సంబంధం చేయలేను, చేయను. చూడను కూడా.”

“చేయకపోతే ఊరుకోండి. కాని ఈ సంబంధానికి నేనొప్పుకోను, ఒప్పుకోను, ఒప్పుకోను!”అంది అత్తయ్య అంతఖచ్చితంగాను.

మామయ్య కరికాలిమంట నెత్తికెక్కింది. పళ్ళు పటపట కొరుకుతూ, “నోరుమూసుకో. పెద్దమనిషిని తీసుకువస్తే అవమానం చేయడం, వచ్చిన సంబంధం తిరగకొట్టడమూ - ఈ యింట్లో మగవాడి మాట చెల్లడం అనేది ఉందా! ఛీ, వెధవ సంసారం! ఎవడు భరిస్తాడు? ఏం సుఖముందని? ఏ సన్యాసుల్లోనో కలిసిపోతే నా పీడ మీకు వదిలిపోతుంది, మీ పీడ నాకు వదిలిపోతుంది” అంటూ మామయ్య విసవిస వెళ్ళిపోయాడు.

రామలింగంగారికేసి కూడా చూడకుండా వెళ్ళిపోతున్నాడు. ఆ విసురులో ఆఖరి మెట్టుమీద కాలువేసి జారిపడ్డాడు కాని, వెంటనే ఒక్క గంతులో లేచి, వెనక్కైనా తిరగకుండా వీధిలోకి వెళ్ళిపోయాడు. మామయ్య మళ్ళీ రాడేమో, నిజంగానే బైరాగుల్లో కలిసిపోతాడేమోనని మాకు భయం వేసింది. కాని ఏంచేయం? అత్తయ్యను చూస్తే నేలమీద చతికిలబడి, యింకా కోపోద్రేకం తగ్గకపోవడంవల్ల దగ్గరకు వెళ్ళే కరచేటట్లుగా ఉంది. ఇటు వదిన తలుపుమూల నక్కిపోయి తన కన్నీటితో నేలమీద పెద్దమడుగు చేసింది.

మామయ్య వెళ్ళిపోయేసరికి, రామలింగంగారు మళ్ళీ రీపీ గీపీ లేని చచ్చు పెద్దమ్మలా తయారయ్యారు. ఇటు గోపాలరావు తండ్రి, అతనితో అంటున్నాడు“ఒరే? ఆ రామయ్యగారింటికి పోదాం పదరా” అని.

“ఈ జ్వరంతో ఈ వర్షంలో వెళ్తే న్యుమోనియాలోకి దింపుతుందేమో, నాన్నా” అన్నాడు గోపాలరావు.

ఆయన మంచంమీదనే వెనక్కి పడిపోయారు. “ఏం మాటలురా! పోనీ” నువ్వేనా పోయి కనుక్కొని రారా అన్నారు.

గోపాలరావు నసగడం మొదలుపెట్టాడు “మనం వెతుక్కొని వెళ్లడం బాగుండదు నాన్నా. పైగా ఈ వర్షంలో ఎక్కడని కనుక్కొను.?”

“మరి ఏంచేదాంరా!” అన్నారాయన విసుగుగా - తప్పంతా గోపాలరావుదే అయినట్లు.

మరి కొంతసేపటికి మామయ్య వెళ్ళి చెప్పాడో ఏమో, ఇంకో కొవ్వూరి రామయ్యగారి వాళ్లు వచ్చారు. “ఏమండోయి, సీతారామయ్యగారూ, వీళ్లింటికి వచ్చారా? మేము వివరంగా చెప్పకపోవడం పెద్ద పొరబాటైంది. రండి మాయింటికి పోదాం” అన్నారు వాళ్ళు. సీతారామయ్యగారు కదలడానికి ఉత్సాహం చూపలేకపోయారు. “నా ఒంట్లో బాగాలేదండి. మావాడు చూస్తే చాలు, వాడిని తీసుకువెళ్ళండి,” అన్నారు. అలాగేనని వాళ్లు గోపాలరావును వెంటబెట్టుకు వెళ్ళారు.

గోపాలరావు ‘అన్నయ్య’ ఇక అన్నయ్య కాడనేది, వదినకు మొగుడు కాడనేది ఖాయమే! నాకు గుండెల్లో ఏదో పొడిచినట్లయింది. సీత అక్కగారి దగ్గర కూర్చొని, అక్క కన్నీళ్ళు చూసి తానూ కళ్ళనీళ్లు పెట్టుకొంది.

కొంతసేపటికి గోపాలరావు వాడిపోయిన మొఖంతో తిరిగివచ్చాడు. కూడా వాళ్ళూ వచ్చారు. సీతారామయ్యగారు వాళ్ళతో చెప్పారు: “చూడడం అయిపోయింది కాబట్టి, మాఊరు వెళ్ళిన తర్వాత పూర్తిగా ఆలోచించుకొని రాస్తాము. అప్పుడు మీరు వస్తే అన్ని విషయాలూ తేల్చుకోవచ్చు.” అలాగే నన్నారు వాళ్లు. మరి కొంతసేపు ఆయనతో అవీ, ఇవీ మాట్లాడి వెళ్ళిపోయారు.

గోపాలరావు మెల్లగా “నాన్నా—” అని ఆగిపోయాడు.

“ఒరేయి, పిచ్చిపిచ్చి ఆలోచన లేమీ పెట్టుకోకు. అనాకారి కాకుండా ఉంటే చాలు. ఏదో సంసార పక్షంగా ఉండాలి కాని సినిమావాళ్ళలా ఉండా లేమిటిరా?” అన్నారాయన.

గోపాలరావు తలవంచుకొని ఉండిపోయాడు.

రామలింగంగారు కూడా మూలుగు

బోనోమింట్

చ్యూయింగ్ గమ్ - విరేచనకారి

బోనోమింట్ త్వరగా మలబద్ధమును పోగొట్టును. మలబద్ధము వలన కలుగు బాధలు - తలనొప్పి, మాంద్యము అలసట వగైరాలు నివారించుటకై తీసికొనబడును. ఇది కడుపులో పోటుగాని, మంటగాని కలిగించదు.



2, 6, 16 బిళ్లల పాకెట్లలో లభించును.

వెస్ట్‌మినిస్టర్ లేబరేటరీస్ లిమిటెడ్, లండన్ వారి తయారీ.

ఏజంట్లు: ఓరియంటల్ మర్కెంటైల్ ఏజెన్సీ

99-ఏ. అర్మీనియన్ వీధి, మద్రాసు.

ప్రారంభించారు. మా అత్తయ్యకు ఒళ్లు మండుకువచ్చింది. విసుగుల్లో పైకే అనేసింది కూడా-(వాళ్ళకు వినబడిందో ఏమో కాని) "వధవ కొంప! అడ్డమయినవాళ్ళకూ ఆసుపత్రిలా తయారైంది. ఎందుకూ పొందని వాళ్ళంతా మూలుగులతో తయారు; మా ప్రాణాలు తీసేందుకు! చుట్టాలా, పక్కాలా ఏమన్నానా?"

అయినా రామలింగంగారికి కూడా సీతారామయ్యగారి పక్కనే మంచం వేశాం. మెల్లిగా మూలుగుకుంటున్నా డాయన. కాళ్ళు నొప్పులుగా ఉన్నాయో ఏమో ఏ లఘుశంక తీర్చుకోడానికో పోవలసివస్తే గోపాలరావు సాయం తీసుకొని నడవవలసి వస్తోంది.

అత్తయ్య ఏ మాలోచించిందో కాని, రామలింగంగారిదగ్గరకు చేరింది. ఎంతో ఆదరంగా అడిగింది: "మీకు ఏం చేయించమన్నారు, బాబు గారూ?"

"ఈపూటకు గోధుమజావ పెట్టించండమ్మా" అన్నా డాయన అతి మెల్లగా.

"అలాగే చేస్తానండి" అని అక్కడే కూర్చుంది అత్తయ్య కదలకుండా.

"బాబూ, ఇదవరకు మీకు—"

"రెండు వివాహాలయ్యాయండి," అన్నా డాయన నిట్టూరుస్తూ.

"కొడుకులు లేరా అండీ?"

"లేరమ్మా నలుగురు కూతుళ్లకీ పదేసి వేలు కట్నాలిచ్చి పెళ్లిచేసి అత్తవారిళ్లకు పంపించేశానమ్మా."

"మహా బాగా చేశారండి. మీరు కనక అలా చేశారు. మాలాంటివాళ్లేముందండీ? ఒక్క పిల్లకే పెళ్ళిచేయలేక తన్నుకులాడుతున్నాము," అంది అత్తయ్య, పొగడ్తతో ఆయన ఉబ్బి, తబ్బిబ్బయేటట్లుగా. మళ్ళీ అంది "మళ్ళీ ఈ పెళ్ళిప్రస్తావన?"—

"వంశం నిలబెట్టేవాడొకడూ లేడుకదా అన్న బాధవల్ల ఇంకొక ప్రయత్నానికి సిద్ధపడుతున్నానండి."

"ఇంతకు ముందు కలగనిది ఇకముందు కలుగుతుందని నమ్మకమెలా, బాబు గారూ?"

"అది మన నిమిత్తంలో లేదమ్మా. అంతా భగవదాయత్తం" అన్నా డాయన వేదాంతధోరణిలో.

ఇది విని సీతారామయ్యగారు మధ్యలో అందుకున్నారు. ఒంట్లో నలత తోడైందేమో గట్టిగా అనేశారు. "భగవదాయత్తంట, భగవదాయత్తం! ఇంకా కొడుకులు పుట్టారనేటయ్యా? పుట్టే యోగముంటే ఇదివరకే పుట్టేవాళ్లు. కాటికి కాళ్ళు చాచుకున్నవాళ్లం మనలాటివాళ్లకయ్యా మళ్లీ పెళ్ళిళ్ళు!...అన్యాయంగా ఆ పిల్ల జీవితం పాడుచేస్తారు. మిమ్మల్ని చేసుకుని ఆ పిల్ల ఏం సుఖపడుతుందని? డబ్బు తింటూ కూర్చుంటుందేమిటి!"

రామలింగంగారు ఆయనకేసి తీక్ష్ణంగా చూశారు. కాని ఏమీ అనలేక పెదవులు కొరుకుకొని, ఊరుకున్నారు. అత్తయ్యవైపు చూశారు. మళ్ళీ అవసరం వచ్చిందికాబోలు గోపాలరావును పిలిచి, అతని ఆసరాతో వాకిట్లోకి పోయి వచ్చారు. మంచంమీద కూర్చోపెట్టినతర్వాత గోపాలరావు అడిగా డాయనను "మంచినీళ్లు తెచ్చి పెట్టనా, అండి" అని. "తెచ్చిపెట్టు నాయనా" అన్నా డాయన. గోపాలరావు తెచ్చియిస్తే త్రాగి అతని ముగంకేసి చూశారు. మళ్ళీ అత్తయ్య ముగంకేసి చూసి, మళ్లీ గోపాలరావు ముగంలోకి చూసి, అత్తయ్యవైపు తిరిగి మెల్లగా అన్నారు.

"మీ అమ్మాయికి వేరేసంబంధం చూచుకోండమ్మా. నే నడ్డుపడను. తగిన వరుడికే ఇచ్చివెయ్యండి," అంటూ గోపాలరావుకేసి చూశారు. అత్తయ్య ముగంలో ఒక్కసారి ఉత్సాహం పొంగివచ్చింది. గుడ్లు పెద్దవి చేసి అలాగే వుండిపోయింది. రామలింగంగారింకా అన్నారు: "ఏగా అనుకోకండమ్మా. బాగా ఆలోచించుకున్న తర్వాతే మళ్ళీ వివాహం ఉద్దేశ్యం విరమించుకోదలచాను. మరోవిధంగా అనుకోకండి. ఈ వానలవల్ల స్వాస్థ్యం కొంత చెడింది. వానలు తగ్గగానే వెళ్ళిపోతాను."

మమ్మల్ని అందరినీ దిగులోనుంచి విడి

ఆంధ్రమాత

శ్రీ లింపొందగ యావదాంధ్ర జనమాతృస్తోత్రలీ
నూత్నతే
జోలీనామృతమాని, తద్బలవదౌత్సుక్యంబునన్
తావకో
ద్వేలప్రాక్తనకీర్తిగీతముల నర్థిన్ పాడు నీ పుత్రపు
త్రీలోకమ్మున కేమి దెల్పెదవు సందేశంబు నాంధ్రావని!

ఆశల్ కౌతుక పూర్ణచంద్రికలు పూయన్, దుర్దినాచ్ఛా
దమౌ
కాశమ్మున్ విడిపోవ, నూతనకళోత్కర్షాపిమైమాతృపూ
జాశోభల్ దయివారు నీశుభదినోత్సాహంబునీక్షించి, నీ
యాశీర్వాదములిమ్ము పుత్రకుల కంబా! యాంధ్ర
దేవీమణీ!

జారిన దేశగర్వమును చక్కనదిద్ది, మహాంధ్రమండలీ
భారము శ్లాఘనీయముగ బాలన చేసి, సమాన రాష్ట్రముల్
కూరిమినాస జేయ తెలుగుంబుడమిన్ గయిసేయరయ్య,
దీటారతి నాంధ్రపుత్రులు! జగజ్జనధర్మమె దృష్టి
నిల్పుచున్.

రాయప్రోలు సుబ్బారావు

★ జారుడు మెట్టు ★

పించినట్లయింది! అత్తయ్య "జావ త్వరగా చేస్తాను, బాబుగారూ," అంటూ వంటింట్లోకి పోయింది. భోజనాలూ, జావల తంతూ పూర్తి అయింది. అత్తయ్య యీ మారు సీతారామయ్యగారి దగ్గరికి చేరింది. ఆయన ఇది చూసి ఏదో ఉపాయంమీదే వచ్చినట్లు పసికట్టి సందేహంతో దగ్గుతున్నారు.

"మా అమ్మాయిని చూడడానికే వచ్చారనుకున్నాం, అన్నగారూ" అంది అత్తయ్య.

"పొరబాటైందమ్మా. ఇంకొకరింటికి పోవలసింది: వానలవల్ల చిక్కుపడి ఇక్కడికి వచ్చాం" అన్నారాయన.

"ఆ సంబంధం వారెంత వరకూ ఉన్నారు?"

"మూడు వేలూ, పైలాంఛనాలూ."

"పిల్ల నచ్చిందాండి?"

"నచ్చకేం జేస్తుంది?" అన్నారు సీతారామయ్యగారు.

"నచ్చకేం జేస్తుంది మూడు వేలు చేతిలో పడుతోంటే!" అందుకున్నారు రామలింగంగారు చేతిలోకి అవకాశం రాగానే.

"మీ కెందుకయ్యా మధ్య?" అని విసుక్కున్నారు సీతారామయ్యగారు.

"ఇందాక నా విషయంలో ఏదో చెప్పారే! ఇప్పుడు మీ విషయంలో నే నెందుకు మాట్లాడకూడదు? ఇందాక చెప్పిన నీతులన్నీ ఎక్కడకు పోయాయి? మూడు వేలు చేతిలో పడితే ఎటువంటి సంబంధమైనా ఉత్తమమైన సంబంధమైపోతుంది గదూ?" అంటూ రామలింగంగారు,— మూలుగంతా ఎక్కడికి పోయిందో కాని— ఉత్సాహంగా లేచికూర్చున్నారు. చేజిక్కిన అవకాశం ఒక పట్టాన విడిచిపెట్టేటట్లు లేరు. అత్తయ్యా, మేమూ అంతా కొయ్యబొమ్మల్లా వాళ్ల వాగ్వాదం వింటూ కూర్చున్నాం.

"నీకేమిటయ్యా, నీతి?" ఎందుకూ పనికి రానివాళ్లే కట్నాలు పుచ్చుకుంటూంటే మేము మూడు వేలు పుచ్చుకుంటే తప్పా? అక్కడికి మేం కోరింది చాలా తక్కువే," అన్నారు సీతారామయ్యగారు గట్టిగా.

"మీ కెంత ఆస్తి ఉంది?"

"ముప్ఫయి ఎకరాలూ, మూడిళ్ళూ." గర్వంగా చూశారు సీతారామయ్యగారు.

"కొడుకులూ, కూతుళ్లూ?"

"కొడుకులు ముగ్గురు, కూతుళ్లు లేరు."

"చేయవలసిన పెళ్లి ఖర్చులూ లేక, అంత ఆస్తి ఉన్నప్పుడు ఈ ముష్టి మూడు వేలు పుచ్చుకోకపోతే నేమయ్యా. డబ్బేం శాశ్వతమా?"

"డబ్బు శాశ్వతం కాకపోతే మనుష్యులూ శాశ్వతం కాదు. నలుగురితో బాటే నేనూ. కట్నాలిచ్చి పిల్లనిస్తామని కాళ్ల మీద పడుతోంటే వద్దనేటంత మూర్ఖుడిని కాను నేను."

"ఇస్తే? - ఇచ్చినంత మాత్రాన పిల్లవాడికి సంబంధం నచ్చిందీ లేనిదీ చూడవద్దూ? మీవాడి ముఖం చూస్తేనే ఇందాక చూసి వచ్చిన సంబంధమేమీ నచ్చలేదని స్పష్టంగా తెలుస్తోంది."

"ఆఁ, వాడి ముహం, వాడికేం తెలుసు" నన్నారు సీతారామయ్యగారు నిర్లక్ష్యంగా.

రామలింగంగారు "ఏం నాయనా, నీకా సంబంధం నచ్చిందా?" అని అడిగారు గోపాలరావుని. సీతారామయ్యగారు 'గోపాలం' అంటూ ఉరిమినా అతను తండ్రికేసి చూడకుండా "నాకు బొత్తిగా నచ్చలేద"న్నాడు.

"అదీ! చూశారా?" అన్నారు రామలింగంగారు సంతోషంతో. "పిల్లవాడికి నచ్చని సంబంధం చేస్తారా? మీరా, అతనా, పెళ్ళి చేసుకునేది? నాథవ డబ్బుకోసం పిల్లవాడికి సుఖం లేకుండా చేస్తారా? మీ రిందాక చెప్పినట్లే మనం కాటికి కాళ్లు చాచుకున్నవాళ్లం. ఈవేళ ఉండి రేపు 'హరీ' అంటాం. ఆపైన మీ కొడుకు జీవితకాలం మీరు చేసిన అన్యాయానికి బాధపడుతూనే ఉంటాడు; అనుకుంటూనే వుంటాడు."

ఆంధ్ర పౌరుషము

గోదావరీపావనోదారవాఃపూర
మఖిలభారతము మా దన్ననాఁడు,
తుంగభద్రాసముత్తుంగరావముతోడ
కవులగానము శ్రుతిఁ గలయునాఁడు,
పెన్నానదీసముత్పన్నకైరవదళ
శ్రేణిలో తెన్గు వాసించునాఁడు,
కృష్ణాతరంగనిర్ణిద్రగానముతోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాఁడు
అక్షరజ్ఞాన మెఱుఁగదో యాంధ్రజాతి ?
విమలకృష్ణానదీసైకతములయందు
కోకిలపుఁబాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమానిశలయందు.

విశ్వనాథ సత్యనారాయణ

సీతారామయ్యగారు దీనికి జవాబు తోచక పిచ్చకోపంతో పళ్లు పటపట లాడిస్తూ మంచంమీద పడిపోయి మరింత గట్టిగా మూల్గ నారంభించారు—"ఈ పీడ ఎక్కడ దాపురించిందిరా, భగవంతుడా" అంటూ.

రామలింగంగారికి హుషారు హెచ్చింది.

"నేను సంబంధం చూసుకుందామనే వచ్చాను. కాని వీరి అమ్మాయినీ, గోపాలాన్నీ చూశాక అటువంటి ప్రయత్నం విరమించుకున్నాను. ఇద్దరినీ చూస్తే నాకెంతో ముచ్చటగా ఉంది. ఇద్దరూ ఈడూ జోడుగా ఉంటారు. మనసులు కలిసి చిలకా గోరింకల్లా సుఖంగా ఉంటారు. నేనేదో పెద్దమనిషిగా సలహా ఇస్తున్నాను వినండి. ఒక కట్నం మినహా మిగతా అన్ని విషయాలలో వీరి అమ్మాయి నచ్చింది కాబట్టి, ఆ కట్నాన్ని కాశించక ఈ సంబంధం చేసుకోండి. ఏం గోపాలం, వీరి అమ్మాయి అంటే నీ కిష్టమేనా ?"

ఇష్టమే నన్నట్లు తల ఊపాడు గోపాలరావు.

సీతారామయ్యగారు మండిపడుతూ అన్నారు: "మీ సలహా ఎవరూ అడగలేదు, అక్కరలేదు కూడా. నా పిల్లాడికి ఏ సంబంధం చేయాలో నాకు తెలుసు. లక్ష సంబంధాలు వస్తున్నాయి. ఇందాకటివారిది కాకపోతే ఇంకొకటి చేస్తాను. కట్నం, లాంఛనాలూ లేకుండా మాత్రం చేసుకోను. నేనంత తలమాసినవాడిని గాను."

అంత మొండిగా చెప్పిన ఆయనకు ఇక సమాధాన మెలా చెప్పాలో తోచక ఊరుకున్నారు రామలింగంగారు. సీతారామయ్యగారంటే మాకు పరమద్వేషం పుట్టుకు వచ్చిందని వేరే చెప్పనక్కరలేదు. అత్తయ్య రామలింగంగారిని దేవుణ్ణి చూసినట్లు చూస్తోంది. ఆయన కాళ్ళు రాతివైయుంటే అక్కడే వేయి కొబ్బరికాయలు కొట్టివేసేది

కొంతసేపుండి రామలింగంగారు మళ్ళీ ప్రారంభించారు: "గోపాలం మీ కెన్నోవాడు ?"

సీతారామయ్యగారి ఓర్పు హరించిపోయింది. "ఏమిటయ్యా నీ ఇన్వెస్టిగేషన్ ! నీ పనేదో చూసుకొని చేతకాకపోతే నీదారిన నువ్వు పోక, మామీద విరుచుకుపడతావేమిటి? నువ్వా నీ అడ్డదిడ్డ ప్రశ్నలూను!"

"నీవు" వరకూ వచ్చింది వ్యవహారం ! కాని రామలింగంగారు తగ్గలేదు. ఆయనకు పట్టుదల మరింత హెచ్చింది.

"అడ్డదిడ్డ ప్రశ్న లేమిటి? ఎన్నోవాడని అడిగితే చెప్పడానికేం? నీఆస్తేమీ దోచుకోబోవడం లేదే ?"

"రెండోవాడు. అయితే ఏం చేస్తావు ?"

రామలింగంగారొక క్షణమాగి, గొంతుక కొంత తగ్గించి అన్నారు. "మీకు ముప్ఫయి ఎకరాలూ, మూడిళ్ళూ ఉంటే నాకు ఏభై ఎకరాలూ, రెండు మేడలూ ఉన్నాయి. నలుగురు కూతుళ్లకూ పదేసివేల కట్నాలిచ్చి అత్తవారిళ్లకు పంపివేశాను. కాని యింత ఆస్తి ఉన్నందుకు నా పేరుతో అనుభవించేవాడెవడూ లేడనే చింతతో యింకో పెళ్లికి సిద్ధపడ్డాను. అది వదులుకున్నాను ఇప్పుడు. మీవాడిని చూసినప్పటనుంచీ నాకెంతో సంతోషంగా వుంది. ఇంత చక్కనివాడూ, మంచివాడూ కొడుకైతే ఎంత బాగుండునో అనిపిస్తోంది. కాబట్టి నామీద దయతలచి నాకు మీవాడిని దత్తత యీయండి. మన కన్నీ కలుస్తాయి. ఈ సంబంధమే చేసి మీవాడిని సుఖపెడతాను."

"నేను పెంపుడు యివ్వను" అని గట్టిగా అన్నారు సీతారామయ్యగారు.

"ఏభై ఎకరాల భూమీ, రెండు మేడలూ మీ కొడుకుకు వస్తూంటే కూడా?"

"నా కొడుకులు నాకేమీ బరువు కారు."

"కొడుకుమీద అంత ప్రేమ ఉన్నవారైతే, కొడుకుని సుఖపెట్టేందుకు ఈ సంబంధమే చేయండి. వారి అమ్మాయి అంటేనే మీవాడికిష్టం."

సీతారామయ్యగారు గట్టిగా శ్వాస వదలి, "నేను పెంపు యివ్వను. కట్నం లాంఛనాలూ లేకుండా పెళ్ళి చేయను" అని ఖండించి చెప్పివేశారు.

మళ్ళీ మొండికెత్తింది వ్యవహారం. ఇక లాభం లేదనిపించింది. గోపాలరావు, అత్తయ్య, వదినా—మా అందరి మొగాలలోనూ నైరాశ్యం తాండవిస్తోంది. నాకు మాత్రం సీతారామయ్యగారిని చీకటి మొట్టి

★ జారుడు మెట్టు ★

కాయలు వేయాలనిపించింది. కాని అది చేతనయ్యే పని కాదని ఊరుకున్నాను. ఇంతలో రామలింగంగారి కేమి తోచిందో "ఇటు రా, నాయనా," అంటూ గోపాలరావును పిలిచి, "నన్ను కాస్త అటు తీసుకు వెళ్లు," అని, అవతల సీతారామయ్యగారు 'గోపాలం, గోపాలం' అని అరుస్తున్నా లెక్క చేయకుండా వాకిట్లోకి వెంట బెట్టుకు వెళ్లారు. కొద్దిసేపటికి తిరిగివచ్చారు.

"ఇదుగో సీతారామయ్యగారూ, మెల్లగా ఆలోచించి చెప్పండి" అన్నారు రామలింగంగారు. "ఇప్పుడొకవేళ వీరే మూడు వేలూ, లాంఛనాలూ ఇస్తే మీకు యీ సంబంధం యిష్టమే అవుతుందికదూ?"

"కావచ్చు" నన్నారు సీతారామయ్యగారు నానుస్తూ.

"కావచ్చు నేమిటి యింకా! ఇంతకన్న మంచి సంబంధం వేరొకటి వుంటుందా? ఈ మూడు వేలూ, లాంఛనాలూ నేనిస్తాను. పెళ్ళి కూడా చేయిస్తాను. ఒప్పుకోండి. మూడు వేలు నాకొక లెక్క కాదు."

సీతారామయ్యగారు ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయారు.

"మీకు కావలసింది ఈ వేలేగా? ఇంకెందుకు సందేహం?"

"నీవేమిటయ్యా తెగ దెప్పుతున్నావు, మధ్య నీ వెవడవు? అసలు వాళ్లు మాట్లాడకుండా."

"ఇదుగో మర్యాదగా చెపుతున్నాను, సీతారామయ్యగారూ, ఇంక కాదూ కూడదూ అంటే మీవాడు మీమాట వినకుండా చేస్తాను. ఏం గోపాలం, ఈ సంబంధం కాక, మరో సంబంధం చేసుకుంటావా?"

"చేసుకోను. చేసుకుంటే యిదే" నన్నాడు గోపాలరావు ధైర్యంగా.

సీతారామయ్యగారు ఏమీ మాట్లాడలేకపోయారు.

"ఆట్టే ఆలోచించక ఈ అమ్మాయిని చేసుకోండి. మీరు కోరినట్లే జరుగుతోంది కదూ, ఇక కాదన్నారంటే వ్యవహారం బెడిసిపోతుంది" అని బెదిరించారు రామలింగంగారు.

అయినా మాట్లాడలేదు సీతారామయ్యగారు.

"ఇక మీ రంగీకరించినట్లే. ఇదుగో అమ్మాయీ: ఇటు రావమ్మా ఒకసారి" అని పిలిచారు రామలింగంగారు వదినని.

వదిన గుమ్మంలోకి వచ్చి సిగ్గుపడుతూ తలవంచుకొని నిలబడింది.

"ఇదుగో, చెపుతున్నానమ్మా - నీ పెండ్లి వైభవంగా జరిపించే బాధ్యత అంతా నాది. కాని ఒక్కటే షరతుఉంది. గోపాలరావు అంగీకరించాడు. ఇక నీదే తరవాయి—" అన్నారు రామలింగంగారు నవ్వుతూ.

"అదేమిటండోయి మీరు ఏ షరతు పెట్టినా మా అమ్మాయి ఒప్పుకుంటుంది, కాదనగలదా?" అంది అత్తయ్య స్థిరంగా కూర్చోలేక.

"అమ్మాయిని చెప్పనీయండి. షరతు ముందే చెపుతున్నానమ్మా. మీకు కలగబోయే సంతానంలో రెండో కొడుకుని నాకు దత్తత యివ్వాలి. అంగీకారమేనా?" అని అడిగాడు రామలింగంగారు నవ్వుతూ.

వదిన గబుక్కున కొంగు మొగాని కంటి పెట్టుకొని నవ్వుతూ గుమ్మంచాటుకు ద్దంగత్తింది.

ఇంతలో సీతారామయ్యగారు మంచపు మీదనుంచి లేచి కూర్చుని అరిచారు: "నీ మూడు వేల దానం నా కక్కరలేదయ్యా! నేనంత గతిలేనివాడి ననుకొన్నావా? మా వాడికి అక్కరలేనిది నాకేమిటి? నేనూ కట్నం లాంఛనాలూ లేకుండానే ఈపిల్లను మావాడికి చేసుకోగలను. "మధ్యవాళ్ళతో నాకేంపని!"

రామలింగంగారు నోరు తెరచుకొని ఉండిపోయారు.

మామయ్య తిరిగి వచ్చాడు మధ్య దారిలోనే సన్యాసంమీద మోజు తగ్గిపోయిందేమో? మామయ్యను చూసి రామలింగంగారు తేరుకొని, "ఏమండోయి రామయ్యగారూ, సమయానికే వచ్చారు, రండి, రండి" అంటూ నన్ను తమలపాకుల పళ్లెం తెమ్మన్నారు. తెచ్చాను. రామలింగంగారు రెండు తాంబూలాలు మామయ్య చేతిలో పెట్టి, "ఇదుగో ఇది సీతారామయ్యగారికీయండి, ఇది గోపాలరావుకీయండి" అన్నారు. మామయ్య తెల్లబోతూ అత్తయ్య వైపు చూశాడు.

రామలింగంగారు, "ఊఁ, ఇవ్వండి, అలా చూస్తారేం? 'ఆలస్యాత్ అమృతం విషం' అన్నారు పెద్దలు. వారి చేతుల్లో తాంబూలాలు పెట్టండి" అని మామయ్య చేత అలా చేయించారు. సీతారామయ్యగారు 'దరిద్రపు వానలు, దరిద్రపు వానలు' అంటూ జపిస్తూ, విసుగుగా తాంబూలం అందుకున్నారు "సరే సీతారామయ్యగారి తరఫున నేను చెపుతున్నాను. సంబంధం ఖాయమైంది కాబట్టి త్వరలో ముహూర్తం పెట్టించవచ్చు. ఈలోగా పెళ్లిపనులు ప్రారంభించవచ్చు" నన్నారు రామలింగంగారు.

వాన వెలిసింది. చుట్టాలు వెళ్లిపోయారు. మేము మా నాకొదళ్ళంతో వీధుల్లోకి విజృంభించాం. ★

అతిమూత్రవ్యాధి
వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు. (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు అరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి, తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము. దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనవే వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్జెక్షన్లు అవసరం లేదు, ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్ళల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు
ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,
పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)

నారసింహ లేహ్యము



బంగారు చేర్చబడినది. మేహము, నిర్వీర్యత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.
పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి-నెల్లూరు జిల్లా.